

అసంపూర్తి పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

మలక్‌పేట మార్కెట్‌లో సమస్యలను పరిష్కరిస్తా

సైదాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మార్కెట్ చైర్ పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. మంగళవారం డైరక్టర్లతో కలిసి మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి పలు సమస్యలను వ్యాపారులు, రైతులు, వినియోగదారులు, హమాలీలు తీసుకువచ్చారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, డైరక్టర్లు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

గోరక్ష మహాపాదయాత్రకు ఘనస్వాగతం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ గోరక్షకుడు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన గోరక్ష మహాపాదయాత్ర మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చేరుకుంది. ఈ పాదయాత్రకు మండల కేంద్రంలో అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ సర్పంచ్ తొర్రునూరి సబితాధనుంజయగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగాస్వాగతం పలికారు. భోజన విరామం అనంతరం పాదయాత్రను తిరిగి ప్రారంభించారు. కొత్తగూడెం మీదుగా పాదయాత్ర యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, గోవర్ధన్ గౌడ్, అంతటి భూకైలాసగౌడ్, వెంకటేష్‌గౌడ్, సాంబశివగౌడ్, ఎంసీ యాదగిరి, బాలశివుడు, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండలకార్యదర్శిగా ఏర్పుల నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో నర్సింహను మూడోసారి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీని మరింత బలోపేతానికి కృషిచేస్తానన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం, ఉద్యమాలు చేస్తానన్నారు.



ఏర్పుల నర్సింహ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్, పాలక వర్గం సభ్యులు

తుర్కయంజాల్ 'సహకార' క్యాలెండర్ ఆవిష్కరణ

హయత్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో మంగళవారం 2025 సంవత్సర క్యాలెండర్‌ను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరక్టర్లు సామ సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, వంగేటి లక్ష్మారెడ్డి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సంఘం సెక్రెటరి రాందాసుగౌడ్, సంఘ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో క్రిస్‌మస్ స్టార్



విద్యుత్ దీపాలతో లిటిల్ ల్యాంప్ చర్చి

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

వనస్థలిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు ఎంతో ప్రీతికరమైన క్రిస్మస్ పర్వదినానికి వనస్థలిపురంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులు చర్చిలను ప్రత్యేక విద్యుత్ దీపాలు, క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంప్ చర్చి, సీఎస్ఐ ఎస్టీ మాథ్యూస్ చర్చి, క్రైస్ట్ గాస్పెల్ చర్చి, బాపిస్ట్‌చర్చిలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. చర్చిల వద్ద పటిష్ఠ బందోబస్తును చేపడుతున్నట్లు వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అమిత్‌షా నోరు అదుపులో పెట్టుకో : బీఎస్పీ

సరూర్‌నగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన నోరు అదుపులో పెట్టుకోవాలని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హెచ్చరించారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బీఎస్పీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రాంశేఖర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, కార్యదర్శి గ్యార జనార్దన్, జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్, జిల్లా శాఖ అధ్యక్షుడు పల్లాటి రాములు, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు కేతావత్ బహుగుణనాయక్ పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తితోపాటు, అతడికి సహకరించిన బాలిక తల్లికి న్యాయస్థానం ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. నాగోల్‌లో నివసించే ఓ మహిళకు మైనర్ కుమార్తె ఉంది. గోగు సురేష్ ఆమెతో కలిసి ఉంటున్నాడు. అతడు బాలికపై కన్నేసి, లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం తెలిసినా బాలిక తల్లి నిందితుడికి సహకరిస్తోంది. దీంతో బాలిక ఫిర్యాదుతో కేసు నాగోల్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ చేసిన రంగారెడ్డి ప్రత్యేక న్యాయస్థానం నిందితులకు ఐదేళ్ల జైలు రూ.14 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా న్యాయస్థానం బాలికకు రూ.3లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

ప్రభుత్వ నిధులు

ప్రైవేట్ రోడ్లు?

- ప్రజాప్రతినిధుల గెస్ట్‌హౌస్, వ్యాపార సముదాయాలకు అనువుగా నిర్మాణం
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల సొంత పనులకు ప్రాధాన్యం
- టెండర్ లేకుండానే పనులు పూర్తి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో వివిధ పన్నుల రూపంలో సమకూరిన నిధులు పెద్దఎత్తున దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ నిధులను మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మౌలికవసతుల కల్పనకు వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడి కౌన్సిలర్లు కొందరు తమ గెస్ట్‌హౌస్, స్థిరాస్తి, వ్యాపార సముదాయాల చుట్టూ మున్సిపల్ నిధులను వెచ్చించి పనులు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సొంత డబ్బులా ప్రజాధనాన్ని గెస్ట్‌హౌస్, వ్యవసాయ భూములు, ఖాళీ ప్లాట్లు, కన్వెన్షన్‌హాళ్ల వద్ద వివిధ పనుల కోసం ఖర్చుచేసి, కౌన్సిల్‌లో తీర్మానం చేసుకుంటున్నారు. ఆ నిధులతో పనులు ఎక్కడ చేస్తున్నారో కూడా అధికారులు పర్యవేక్షించకపోవడం విడ్డూరం. నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు సైతం వారితో కుమ్మక్కై ప్రజాధనం లూటీకి పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి ఈ తతంగం అంతా నడిపిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెతకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

టెండర్లు పిలువకుండానే..

వివిధ అభివృద్ధి పనుల పేరిట పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో పెద్దఎత్తున నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. వార్డు పరిధిలోని కాలనీల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను కొందరు కౌన్సిలర్లు తమ సొంత ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం పట్ల మున్సిపల్ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలోనే ఈ తంతంతా నడుస్తున్నట్లు తెలుస్తోంది. డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేపట్టాలంటే టెక్నికల్ అనుమతి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తారు. టెండర్ లేకుండా ఎలాంటి పనులూ చేపట్టకూడదు. ఇక్కడి మున్సిపాలిటీ నిబంధనలు పాటించకుండా లక్షల రూపాయల అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నారు. ఆ తర్వాత దొడ్డిదారిన టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తున్న అధికారులు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఇందులో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

విచారణ చేపట్టాలి..

ఇళ్లు ఉన్న నివాస ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా తమ సొంత వ్యాపార సముదాయాల వద్ద ప్రభుత్వ నిధులతో పనులు చేసుకోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగం లేని చోటా మున్సిపల్ నిధులతో చేపట్టిన పనులపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. నిధుల దుర్వినియోగంలో ఇంజనీరింగ్ అధికారుల అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ డీఈఈ శివానందంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎక్కడ కూడా నిధులు దుర్వినియోగం కాలేదంటూ.. తనకు ఏమీ తెలియదని ఫోన్ కట్ చేశారు.



తట్టిఅన్నారంలో ఓ ప్రజా ప్రతినిధి గెస్ట్‌హౌస్ ముందు ప్రభుత్వ నిధులతో వేసిన సీసీ రోడ్డు

ఇవిగో కొన్ని ఉదాహరణలు

- మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంకు చెందిన ప్రజా ప్రతినిధి తన గెస్ట్‌హౌస్ ముందు రూ.7లక్షల మున్సిపల్ నిధులతో సీసీరోడ్డు వేయించుకున్నాడు. నిబంధనల ప్రకారం 12 ఫీట్ల రోడ్డును వేయాలి. కానీ సారు గెస్ట్‌హౌస్ ముందు 14 ఫీట్ల రోడ్డు వేశారు. కేవలం ఒక్క గెస్ట్‌హౌస్ కోసమే అక్కడ సీసీ రోడ్డు నిర్మించారు.
- తట్టిఅన్నారం చౌరస్తాలో ఓ ప్రజాప్రతినిధికి వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అక్కడ ఉన్న కల్వర్టు నుంచి నీరు తన వ్యాపార సముదాయాల వద్దకు రాకుండా ఏకంగా రూ.8 లక్షల మున్సిపల్ నిధులను వెచ్చించి ఆర్‌సీసీ డ్రైన్‌నిర్మాణం చేయించారు. ఆ కాంట్రాక్ట్ పనులను కూడా తన బంధువుకే ఇప్పించి చేయించారు. ప్రజాప్రతినిధి సొంత స్థిరాస్తి వద్ద పనుల కోసం లక్షల ప్రజాధనాన్ని అధికారులు వృథాగా ఖర్చు చేశారు.
- తట్టిఅన్నారం ప్రధానకూడలి సమీపంలోని వివాదాస్పద ప్రభుత్వ భూమిలో ఏకంగా రూ.20లక్షలతో సీసీరోడ్డును నిర్మించారు. అక్కడ ఎలాంటి ఇళ్ల నిర్మాణాలూ లేవు. ప్రజాప్రతినిధితోపాటు మరి కొందరి నాయకులకు అక్కడ ఉన్న ఖాళీ ప్లాట్లను లీజుకిచ్చారు. వాటి కోసం మున్సిపాలిటీ నిధులతో అప్పనంగా సీసీ రోడ్డులు వేసుకున్నారు.
- కుంట్లూర్‌లోని ఓ వార్డులో తమ వ్యాపార అవసరాల కోసం మున్సిపల్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం కోసం కౌన్సిల్‌లో తీర్మానించారు. ఆ విషయం బయట పడడంతోపాటు దానిపై పెద్దఎత్తున ఆరోపణలు రావడం.. రచ్చరచ్చ కావడంతో ప్రస్తుతం ఆగిపోయింది.
- తన వార్డు అభివృద్ధికి కోసం మున్సిపాలిటీ నుంచి కేటాయించిన రూ.25 లక్షల నిధులను ఓ కౌన్సిలర్ పక్క వార్డులో పనులకు వినియోగించారు. ఎందుకంటే అక్కడ తమ కుటుంబానికి చెందిన ఓ వ్యాపార సముదాయం ఉంది. ఆ నిధులతో ప్రత్యేకంగా దానికి డ్రైనేజీలైన్, సీసీ రోడ్డు వేయించుకున్నారు. ఇలా చాలా చోట్లా మున్సిపల్ నిధులను ప్రజాప్రతినిధులు సొంత పనులకు వాడుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీటిపై కలెక్టర్ విచారణ చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ విషయంలో ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే..



తట్టిఅన్నారం ప్రభుత్వ భూమిలో అవసరం లేకున్నా ప్రజాధనంతో వేసిన సీసీ రోడ్డు



పెద్దఅంబర్‌పేట్‌లో ఓ కన్వెన్షన్ కోసం మున్సిపల్ నిధులు వెచ్చించి వేసిన డ్రైనేజీ, సీసీ రోడ్డు



కుంట్లూర్‌లో వ్యాపార అవసరాల కోసం మున్సిపల్ నిధులతో తీర్మానం చేసిన రోడ్డు

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి: కార్పొరేటర్

సరూర్‌నగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధిపై దృష్టి పెట్టి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రయత్నించాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ప్రస్తుతం అనేక స్వయం ఉపాధి పథకాలు అందుబాటులో ఉన్నందున ఇష్టమైన వ్యాపకాన్ని చేపట్టి ముందడుగు వేయాలని ఆమె సూచించారు. జనశిక్షణ అభియాన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కుట్టు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం ఇక్కడి ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బి.కుమార్, జనశిక్షణ అభియాన్ డైరెక్టర్ రామ్మోహన్, విజయలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో పారిజాతారెడ్డి

భక్తిశ్రద్ధలతో జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రుగ్వేద, యజుర్వేద, సామవేద హవనం సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవాలు నాగోల్ డివిజన్ పరిధిలోని జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వైదిక విజ్ఞాన ట్రస్టు, ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు రావాలని ఐదురోజుల పాటు జరిగే మహోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆహ్వానించారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు



ఎన్‌సీసీ విద్యార్థులతో తెలంగాణ నార్కోటిక్స్ పోలీసులు, త్రీ ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు

2025ను డ్రగ్స్ రహితంగా స్వాగతిద్దాం

నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా

హయత్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహితంగా వేడుకలు చేసుకుని 2025 కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దామని తెలంగాణ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా అన్నారు. హయత్‌నగర్‌లోని వార్డ్ అండ్ డీడ్ పాఠశాలలో తెలంగాణ నార్కోటిక్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సందీప్ శాండిల్యా హాజరై మాట్లాడారు. తెలంగాణలో 1.3 లక్షల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, 70 వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ఉన్నారని తెలిపారు. ఈ రెండు లక్షల మందిని యాంటీ డ్రగ్స్ సోల్జర్లుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డ్ అండ్ డీడ్ పాఠశాలలో 500 మంది యాంటీ డ్రగ్స్ సైనికులు తయారు అయ్యారని తెలిపారు. ఈ రోజు నుంచి వారు స్మోకింగ్, డ్రింకింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రమాణం చేశారని చెప్పారు. యాంటీ డ్రగ్స్ సైనికులే పోలీసులకు కళ్లు, చెవులని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

వారితో ప్రత్యేక సమావేశం

రానున్న కొత్త సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలోని పబ్బులు, క్లబులు, రిసార్టు, హోటల్స్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి డ్రగ్స్ రహిత వేడుకలు జరుపుకోవాలని సూచిస్తామని సందీప్ శాండిల్యా వివరించారు. చట్టాన్ని అతిక్రమించి డీజేలు లాంటివి ఏర్పాటు చేస్తే ఇంటిలిజన్స్ ద్వారా గుర్తిస్తామన్నారు.

కొత్త సంవత్సరం నుంచి నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్లు

2025 కొత్త సంవత్సరం నుంచి రాష్ట్రంలో వరంగల్, రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్లు ప్రారంభిస్తున్నట్లు సందీప్ శాండిల్యా తెలిపారు. ఇప్పటికే వరంగల్ స్టేషన్ ప్రారంభమైందన్నారు. అనంతరం డ్రగ్స్ ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను, ఉపయోగించి చనిపోయిన ప్రముఖుల గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా నార్కోటిక్స్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రీ ఎన్‌సీసీ బెటాలియన్ హైదరాబాద్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ టి.శరత్, రాచకొండ నార్కోటిక్స్ ఆఫీసర్ బి.రమేష్, యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ఆఫీసర్ సుబ్బరామిరెడ్డి, సీఐలు శ్రీనివాస్, రాంప్రసాద్, హయత్‌నగర్ లా అండ్ ఆర్డర్ సీఐ నాగరాజుగౌడ్‌తో పాటు 500 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైయినేజీ సమస్యలను పరిష్కరించండి

కొత్తపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో తాగునీటి సరఫరా, డ్రైయినేజీ సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి విన్నవించారు. మంగళవారం ఆయన జలమండలి ప్రధానకార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమయ్యారు. డివిజన్‌లోని కాలనీల్లో జనావాసాలు తక్కువగా ఉన్నప్పుడు నిర్మించిన తాగు నీరు, డ్రైనేజీ పైప్‌లైన్లతో ప్రస్తుతం తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. భరత్‌నగర్-2, శ్రీశంకర్‌కాలనీ, శివగంగకాలనీల నుంచి కామినేని చౌరస్తా వరకు ఎక్కువ సామర్థ్యం గల డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలన్నారు. అల్కాపురి చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీనగర్-1 హనుమాన్ ఆలయం వరకు 300 మీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్ మంజూరు చేయాలని, పైప్‌లైన్స్ వేసిన ప్రాంతాల్లో పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పనుల పరిశీలన

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లో చేపడుతున్న రోడ్డు పనులను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం పరిశీలించారు. నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు.

-వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి



సంచార జాతులకు 5 శాతం వాటా కావాలి

హయత్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంచార జాతులన్నింటికీ కలిపి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి (బీజేహెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బీజేహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బీఆర్‌కే భవన్‌లోని ఎస్సీవర్గీకరణ ఏకసభ్య కమిషన్ షమీమ్‌అక్తర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, సంఘం జాతీయ అధ్యక్షుడు కొడిగంటి నరసింహులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలలోని 59 సంచార కులాలకు రిజర్వేషన్లలో 5 శాతం వాటా కేటాయించాలని కోరారు. చట్టం కల్పించిన రిజర్వేషన్లు కొన్ని ఉపకులాలకు మాత్రమే దక్కుతున్నాయని తెలిపారు. కడమంచి సహదేవుడు, తుర్పాటి శ్రీనివాసులు, చిన్న కొటయ్య, గగనం రాజు, బన్నికుమార్ తదితరులు ఉన్నారు.



ఏకసభ్య కమిషన్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నం

కొత్తపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని మన్సూరాబాద్ హిమపురికాలనీలో గుర్తుతెలియని దుండగుడు ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించాడు. ఎస్‌హెచ్‌ఓ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...హిమపురి కాలనీలో ఉండే సోమసాని సతీష్‌రెడ్డి మలక్‌పేటలో ప్యాథాలజీ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఆయన భార్యాపిల్లలు పుట్టింటికి వెళ్లారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఆయన ఇంటికి తాళం వేసి ల్యాబ్‌కు వెళ్లి, రాత్రి 10.45 గంటలకు తిరిగొచ్చాడు. తాళం పగులగొట్టి ఉండడంతో వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్, డీఎస్ఐ నరేందర్, క్రైమ్‌టీం, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇంట్లో ఏమీ దొరకక దొంగ వెళ్లిపోయాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మార్చిలోగా పూర్తికాకపోతే నిధులు వెనక్కి

- బడంగ్‌పేట్ అధికారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి
- గాంధీనగర్ చౌరస్తాను విస్తరించాలని సూచన

సరూర్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్-బడంగ్‌పేట్ ప్రధాన రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తిచేయాలని, లేనట్టయితే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉన్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అధికారులకు సూచించారు. విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను ముందుగా తొలగించాలని, అనంతరం రహదారిని నిర్ణీత వెడల్పు మేరకు విస్తరించాలని స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 28, 29వ డివిజన్ల పరిధిలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గాంధీనగర్ కూడలి వద్దకు చేరుకుని అక్కడి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చిలోగా పనులు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే అవకాశమున్నందున అధికారులు పనుల్లో జాప్యాన్ని నివారించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రహదారి విస్తరణలో భాగంగా గాంధీనగర్ కూడలిని సైతం వాహనాల రాకపోకలకు అనుగుణంగా విస్తరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. గాంధీనగర్ చౌరస్తాను విస్తరించిన అనంతరం సర్కిల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సరస్వతి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

లిక్విడ్ గంజా సరఫరా ముఠా అరెస్ట్

- ఒడిశాలో లీటర్ గంజా 1.2లక్షలు.. నగరంలో రూ.3లక్షలు
- 4 లీటర్ల హాష్ ఆయిల్, కారు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం
- నిందితులకు రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజా హాష్ ఆయిల్ (లిక్విడ్ గంజా)ను సరఫరా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 4 లీటర్ల హాష్ ఆయిల్‌తో పాటు 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వారిని హయత్‌నగర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన జయదేవ్ హైదర్(37), అదేప్రాంతానికి చెందిన జితేంద్ర పంగి(38), దేబమది(32), ఆకాష్‌సర్కార్(21) నలుగురూ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలంగా ఒడిశా తక్కువ ధరకు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి కారులో హైదరాబాద్‌కు తెచ్చి, ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఒడిశా నుంచి కారులో హాష్ గంజా తీసుకువస్తున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సోమవారం విశ్వసనీయ సమాచారం అందింది. సాయంత్రం మెట్ చౌరస్తాలోని కృష్ణవేణి స్కూల్ కమాన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. స్విఫ్ట్ కారు(ఓడీ30ఈ4049) లో తనిఖీ చేయగా నాలుగు ప్లాస్టిక్ బ్యాగుల్లో ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఓపెన్ చేసి చూడగా అందులో హాష్ ఆయిల్ ఉన్నది. వెంటనే నలుగురిని అదుపులోకి తీసుకుని కారుతో పాటు 4 లీటర్ల హాస్‌ఆయిల్, 4సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా హాష్ ఆయిల్‌ను వనస్థలిపురానికి చెందిన చిన్నకు సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఒడిశాలో ఒక లీటర్ హాష్ ఆయిల్‌ను రూ.1.20లక్షలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ.3లక్షలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏ-1 జయదేవ్ హైదర్ 2019లో గంజా కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా జయదేవ్ తిరిగి గంజా వ్యాపారం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మంగళవారం నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు.



హాష్ ఆయిల్‌తో పట్టుబడిన నిందితులు